క్లుప్తంగా

హామీలు అమలు చేయాలి

వరంగల్: ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు కోరారు. రెండు లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.7,500, రూ.500 బోనస్‌తో పాటు ఎంఎస్‌పీ అమలు చేయాలని సూచించారు. ఈమేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

తోటబడిలో సాహిత్య పోటీలు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ (తోటబడి) స్కూల్‌లో ఆదివారం వ్యాసరచన, క్విజ్, మాక్ పార్లమెంట్, డాక్యుమెంటరీ, స్పెల్‌బీ, లైవ్ రిపోర్టింగ్ వంటి 12 అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, స్కూల్ ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ మార్గరేట్, కరస్పాండెంట్ ఫాతిమా, ప్రిన్సిపాల్ మేరీజయ, అధ్యాపకురాలు ఆల్ఫోన్స్ పాల్గొన్నారు.

'కేసీఆర్' చిత్రం వీక్షణ



హన్మకొండ: జబర్దస్త్ నటుడు రాకింగ్ రాకేష్ నటించి, నిర్మించిన 'కేసీఆర్' చిత్రాన్ని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ వీక్షించారు. వరంగల్‌లోని రామ్ లక్ష్మణ్ థియేటర్‌లో చిత్ర యూనిట్‌తో కలిసి సినిమాను ఆదివారం తిలకించారు. ముందుగా హీరో రాకేష్, దర్శకుడు అంజీ, నటీనటులతో కలిసి వినయ్‌భాస్కర్.. భద్రకాళి ఆలయంలో పూజలు చేశారు.

పడిపూజ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో డిసెంబర్ 11న నిర్వహించనున్న మహా పడిపూజ కార్యక్రమ వాల్‌పోస్టర్లను అటవీ పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఖిలా వరంగల్ క్రీడామైదానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపకుడు టీఆర్ బాలసుబ్రమణ్యశర్మ, నిర్వాహక అర్చకుడు గణపతిశర్మ.. మంత్రి సురేఖకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి మహా పడిపూజకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, రఘుగురుస్వామి పాల్గొన్నారు.

శ్వేతార్క వన భోజనాలు



కాజీపేట: కాజీపేట పట్టణ శివారులోని మామిడి తోటలో భక్తులతో కలిసి శ్వేతార్క మూలగణపతి దేవాలయ కార్యకర్తలు ఆదివారం కార్తీక వనభోజనాలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో పండితులు మహాశివుడికి అభిషేకాలు, అర్చనలు, తులసి చెట్టు కింద సామూహిక రమా సమేత సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

ఖిలా వరంగల్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అన్నారు. శంభునిపేటలోని రెనాల్డ్స్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ నామాల శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణాన్ని కొనసాగించవచ్చని వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజేశ్వర్, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొడ్రాయి పంచమ వార్షికోత్సవం

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లో ప్రతిష్ఠించిన లక్ష్మి, భూలక్ష్మి సహిత (బొడ్రాయి) పంచమ వార్షిక మహోత్సవ పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వేద పండితులు పాలకుర్తి సుబ్రమణ్యం శర్మ, కుసుమ రామకృష్ణ శాస్త్రి బృందం సభ్యులు, బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు ఇనుమల మల్లేశం ఆధ్వర్యంలో గ్రామ దేవత బొడ్రాయికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు వేద పండితులు గోమాత పూజలు, యాగశాల ప్రవేశం చేసి మహాగణపతి పూజ, సర్వప్రాయశ్చిత్తం, ద్వార తోరణ పూజ, పుణ్యాహవాచన మాతృకా పూజలు, నవగ్రహ పూజలు జరిపించారు. సాయంత్రం కుంకుమార్చన, భద్రమండల హోమం జరిపించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సాగర్ల శ్రీనివాస్, బైరబోయిన దామోదర్, గజ్జెల శ్యామ్, పుప్పాల రాజేందర్, మిట్టపెల్లి వెంకన్న, దిండిగాల సోమేశ్వర్, బొల్లలింగం, బెల్లంకొండ సుధాకర్, కృష్ణమూర్తి, రాములు, వాణి, రావుల రాజేష్, నర్మెట్ట లింగమూర్తి, చంద్రమౌళి, కోటి పాల్గొన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డు

జాడలేని కంపోస్టు ఎరువు తయారీ
- సేకరించిన చెత్తను తగలబెడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



మాందారిపేటలో తగలబెట్టిన చెత్త



ఉపయోగంలో లేని డంపింగ్ యార్డు



డంపింగ్ యార్డులోని వర్మీ కంపోస్టు బెడ్

శాయంపేట : గ్రామాల్లో ప్రతి రోజు ఇంటింటా సేకరించిన చెత్తను తడి,పొడిగా వేరు చేసి కంపోస్టు ఎరువుగా తయారు చేయాలి.. కానీ సేకరించిన చెత్తను ఊరికి చివరన కుప్పలుగా పోసి తగలబెడుతుండడంతో పర్యావరణం దెబ్బతింటుంది. సేకరించిన చెత్తను కంపోస్టుగా తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలు లాభాలు సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డంపింగ్ యార్డులను నిర్మించింది. అందులో భాగంగానే చెత్త సేకరణకు ప్రతి గ్రామానికి ట్రాక్టర్ ఏర్పాటుతో పాటు మల్టీపర్పస్ వర్కర్లను నియమించింది. డంపింగ్ యార్డు వద్ద చెత్తను వేరు చేసి తడి చెత్తను నిల్వచేసి కంపోస్టు ఎరువుగా తయారు చేయడం పొడి చెత్తలో లభించే ఇనుము, ప్లాస్టిక్ తదితర వస్తువులను విక్రయించడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాల్సి ఉంటుంది. తయారుచేసిన కంపోస్టు ఎరువును ఇతరులకు విక్రయించడం లేదంటే హరితహారం మొక్కలకు వినియోగించాల్సి ఉంటుంది. డంపింగ్ యార్డులు నిర్మించిన కొత్తలో చెత్త నుంచి ఎరువులను తయారు చేసిన సిబ్బంది తర్వాత వివిధ కారణాలతో పట్టించుకోలేదు. మండలంలోని మాందారిపేట శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో చెత్తను కుప్పగా పడేసి కాల్చేస్తున్నారు. అధికారులు సైతం డంపింగ్ యార్డుల వినియోగంపై అంతగా దృష్టి సారించడం లేదు. దీంతో తగలబెడుతున్న చెత్తతో పొగ, దుమ్ము ధూళితో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లో డంపింగ్ యార్డులు నేటికి అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి.

దృష్టిసారించని అధికారులు

అలంకార డంపింగ్ యార్డులతో గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయం లేక..షెడ్ల కోసం వెచ్చించిన నిధులు వృథా అయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. యార్డుల్లో చెత్త లేక ఎరువుల తయారీ చేయక కంపోస్ట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డుల నిర్మాణం చేపట్టింది. ఒక్కో డంపింగ్ యార్డు నిర్మాణానికి రూ. 2లక్షల నిధులు ఖర్చు చేసింది. కానీ నిర్మించి వదిలేయడంతో ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులు సైతం వృథా అయ్యాయి. మరోపక్క కార్మికులకు అదనపు పని భారం కావడం..అప్పటికే రోడ్లు, మురుగు కాల్వలు శుభ్రం చేయడం వంటి అనేక పనులు చేపడుతున్నారు. వీటికి తోడు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే వరకు మధ్యాహ్నం అవుతుంది. చిన్న గ్రామాల్లో ఎరువులు తయారు చేసేంత చెత్త లభించడం లేదని చెబుతున్నారు. చెత్తతో ఎరువులు తయారు చేస్తే కనీసం హరితహారం మొక్కలకైనా వేసేందుకు అవకాశం లభిస్తుంది. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం.. పంచాయతీ కార్యదర్శులు సైతం అంతగా దృష్టి సారించకపోవడంతో ఎరువుల తయారీ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి చెత్తను వృథాగా కాల్చకుండా, సద్వినియోగం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మించి..వదిలేశారు



గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డుల నిర్మాణానికి రూ.2లక్షల నిధులు ఖర్చు చేసింది. కానీ నిర్మించి వదిలేయడంతో ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు అందించాలి.

– పాడిశెట్టి గణేష్

వినియోగంలోకి తీసుకురావాలి



కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డును నిర్మించింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసి గ్రామాల శివారులో చెత్తను కుప్పలుగా పోసి తగలబెడుతున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురావాలి.

– గిద్దమారి సురేష్

మహాసభను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజుగౌడ్ తదితరులు

కమలాపూర్ : కాజీపేటలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న భవన నిర్మాణ కార్మికుల ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం ఆయన భవన నిర్మాణ కార్మికులతో కలిసి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఈ మహాసభకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సర్వే కాని వారు నేడు గ్రామపంచాయతీకి రావాలి

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి కాని వారు తమ కుటుంబ సభ్యుల వివరాలతో నేడు (సోమవారం)ఆత్మకూరు గ్రామపంచాయతీ కార్యాలయానికి రావాలని జీపీ కార్యదర్శి శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీకి వచ్చి తమ వివరాలు అందజేస్తే ఎన్యుమరేటర్‌తో నమోదు చేయిస్తామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

వేలేరు : బీజేపీ సభ్యత్వ నమోదుకు భారీ స్పందన లభిస్తోందని ఆ పార్టీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి సొడ రమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి క్రియాశీలక సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం మొత్తం మోదీ, బీజేపీ వైపు చూస్తోందని అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన వెల్లడించారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి ఏడాది కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు, ప్రధాన కార్యదర్శి జోడుముంతల నవీన్, బూత్ అధ్యక్షులు సురేందర్, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం



మహిళలను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పార్వతీదేవి సమేత మహాదేవస్వామి పంచకూట శివాలయంలో ఆదివారం పునఃప్రతిష్ఠ ఉత్సవాల్లో కోలాట ప్రదర్శనలు నిర్వహించిన మహిళా భక్తులను కమిటీ సభ్యులు సత్కరించారు. మహిళలకు దుస్తులు ప్రదానం చేశారు. అర్చకులు రవీందర్ శర్మ, కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డి, తోట రఘు, బూర కిషోర్ కుమార్, సిరిపురం సంపత్, బాషబోయిన సాగర్, రేవూరి దేవేందర్ రెడ్డి, ఎర్ర తిరుపతిరెడ్డి, వంగాల భగవాన్‌రెడ్డి, రేవూరి సుధాకర్ రెడ్డి, పాపని రవీందర్, మండల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత



చిలకమ్మను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

దామెర : మతిస్థిమితం లేని మహిళను వారి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన దామెర మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ..పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లికి చెందిన చిలకమ్మ మతిస్థిమితం సరిగాలేక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ క్రమంలో రైలులో శనివారం హైదరాబాద్‌కు వెళ్తుండగా కుటుంబ సభ్యులకు తెలువకుండా కాజీపేటలో దిగిపోయింది. అనంతరం ఆటోలో దామెరకు చేరుకోగా స్థానికులకు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా చిలకమ్మతో మాట్లాడి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చిలకమ్మ కుమారుడు నవీన్, భర్త రాములు దామెరకు చేరుకొని చిలుకమ్మను తీసుకెళ్లారు. తన తల్లిని తమకు అప్పగించిన పోలీసులకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

చేప పిల్లల పంపిణీ ఎప్పుడు?

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ చెరువులో ఇంతవరకు చేపపిల్లలు వేయలేదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గత సీజన్‌లో ప్రభుత్వం చేపపిల్లలు పంపిణీ చేసి వేసేదని, కానీ ఇప్పుడు తాత్సారం చేయడం వల్ల ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా మత్స్యశాఖ అధికారులు స్పందించి చెరువుల్లో సరిపడా చేపపిల్లలను వేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. చేపపిల్లలు ఇప్పుడు వేస్తేనే అవి సమయానికి ఎదుగుతాయని వారు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి



మమత (ఫైల్)

ఐనవోలు : అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సింహులగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన కథనం ప్రకారం కట్కూరి మమత(38) అనారోగ్య సమస్యలతో గత మూడేళ్లుగా బాధపడుతోంది. దీంతో తీవ్రంగా మదనపడుతూ మందులు వాడుతున్న తగ్గడం లేదని భర్తతో చెబుతూ బాధ పడుతూ ఉండేది. ఈ క్రమంలో ఈ నెల 19న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన స్థానికులు మమత భర్తకు సమాచారం అందించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు. మృతురాలి భర్త కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

బీకేఎంయూ జిల్లా కమిటీ ఎన్నిక

మడికొండ: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్రె లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడిగా మునిగాల భిక్షపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ నియామకానికి సహకరించిన నాయకులు బాలమల్లేశ్, భిక్షపతికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

వేలేరు : సెల్‌ఫోన్ మాట్లాడుతూ కారు అజాగ్రత్తగా నడిపి ఓ వృద్ధురాలిని ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేష్ ఆదివారం తెలిపారు. మండలంలోని షోడాషపల్లి గ్రామానికి చెందిన నీలం గోనమ్మ ఈనెల 22న పనినిమిత్తం నడుచుకుంటూ వెళ్తుండగా సట్ల ప్రణీందర్ తన కారుతో అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టాడు. దీంతో గోనమ్మ తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. కారు అజాగ్రత్తగా నడిపి వృద్ధురాలిని ఢీకొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆమె కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అభినందన



శాయంపేట : హనుమకొండలోని జేఎస్ఎస్‌లో శనివారం జరిగిన ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామోత్సవాల్లో భాగంగా మహిళలకు త్రోబాల్ జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో పాల్గొన్న శాయంపేట మహిళా టీం ప్రథమ స్థానంలో నిలిచింది. ఇషా ఫౌండేషన్ గౌరవ సభ్యుడు డాక్టర్ రమాకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్, వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ నరెడ్ల శ్రీధర్, యాదిరెడ్డి, వలంటీర్ శిరీష, క్రీడాకారులకు ప్రశంస పత్రాలు, నగదు పురస్కారాలను అందజేశారు. కాగా, ఆదివారం తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, క్రీడాకారులను, టీం కోచ్ కరితను అభినందించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

పరకాల : ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పరకాల ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని కోరారు. నూతనంగా ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం ఆదివారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సోదా రామకృష్ణ, అధ్యక్షుడు లావుడ్య గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి ఈ.ఆర్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మిల్లర్లు ఇబ్బంది పెడితే చెప్పండి

- తహసీల్దార్ సత్యనారాయణ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

శాయంపేట : మిల్లర్లు, ధాన్యం కొనుగోలు నిర్వాహకులు ఏమైనా ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ సత్యనారాయణ రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని మైలారం, జోగంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని తూర్పార పట్టి 17 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టాలని సూచించారు. మిల్లర్ల వద్ద ఏమైనా ఇబ్బందులు వస్తే తన దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. లారీలు రాకుంటే లారీ యజమాని నంబర్ 93939 34385కు ఫోన్ చేయాలన్నారు. ఆయన వెంట రైతులు, నిర్వాహకులు ఉన్నారు.

ఓటరు నమోదు కేంద్రం తనిఖీ

శాయంపేట మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సత్యనారాయణ ఆదివారం తనిఖీ చేసి పరిశీలించారు. 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేయడానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు కొత్త ఓటరు నమోదు, సవరణ స్పెషల్ క్యాంపు మండలంలోని 42 పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతోంది. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటరు నమోదు కోసం ఫారం–6, ఏమైన తప్పులు ఉన్న వారు సవరణ చేసుకోవడానికి ఫారం–8ను, చేర్పులు, మార్పులకు ఫారం–7ను నింపి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు గిర్దావర్ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ అచ్చారావు, జూనియర్ అసిస్టెంట్ శైలజ, బీఎల్ఓలు తులసీమోహన్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో గల పద్మ హైస్కూల్‌లో 2002–03 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో బాల్య స్మృతులు, పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ కం ప్రధానోపాధ్యాయుడు పరిటాల బాలకృష్ణమూర్తితో పాటు అప్పటి గురువులను పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు నరోత్తం రెడ్డి, రాజేందర్, రవికుమార్, ప్రసాద్, కిషోర్ కుమార్, రమణారెడ్డి, శాంతిభూషన్, తిరుపతిరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో నరిగె రంజిత్, లక్ష్మారెడ్డి, సతీష్, హరీష్, ప్రత్యూష, నవలీల, స్వాతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

తరుగు పేరిట రెండు కిలోల కోత



ధాన్యం బస్తాలు

నడికూడ : మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట ఒక్కో బస్తాకు (ప్యాడీ క్లీన్ చేయడం లేదని) అదనంగా రెండు కిలోల తక్కువ తూకం వేస్తున్నారు. తీరా మిల్లుకు చేరిన తర్వాత బస్తాకు మరో కిలో వరకు తరుగు తీసి కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, చాలా చోట్ల ధాన్యం కొనుగోల కేంద్రాల వద్ద రైతులకు కనీస సదుపాయాలు కల్పించడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తరుగు పేరిట కోత విధించకుండా, సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రణవ్

కమలాపూర్ : కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నేడు (సోమవారం) జరిగే నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ కోరారు. ఆదివారం కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారోత్సవ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించి, పాలకవర్గంతో సమావేశమయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి–రవీందర్, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది: ప్రణవ్

బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఒడితల ప్రణవ్ తెలిపారు. మండలంలోని కన్నూరులో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో మండల బ్రాహ్మణ కార్తీక సమారాధన కార్యక్రమానికి ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరై వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలరావు, మండల అధ్యక్షుడు మహీదర్‌రావు, ఉమ్మడి రాష్ట్ర పీఆర్‌ఓ వంశీధర్‌రావు, నాయకులు తిరువెంగళాచారి, శ్రీనివాసరావు, జయప్రదరావు, గిరిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం రాక

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సోమవారం కమలాపూర్ గ్రామానికి రానున్నట్లు హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్ తెలిపారు. కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జరిగే మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి పొన్నం పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు.